# మనిషిలో మనిషి

అమ్మయ్య, రేపు ఆదివారం, తీరిగ్గా ఏడింటిదాకా పడుకోవచ్చు. ఈ రోజింకా వెన్నెల రాదేం? వెన్నెట్లో భోజం చేసి ఎన్నాళ్ళయిందో, 'తెల్ల చీరలో నువ్వు ఓ చంద్ర కిరణంలా వున్నావు రాధీ' అనేవాడు వాసు. ఇప్పుడెక్కడున్నాడో? అన్నట్టు రేపయినా ఆ తెల్లచీర ఉతికి ఇస్త్రీ చేయాలి. ఈ ఎదురింటి కుర్రాడికదేం రోగమో సాయంత్రమయ్యే సరికి మల్లెపూల లాంటి బట్టలు వేసుకొని ఆ టైపిస్టు పిల్లకు ఫోజులు కొడుతుంటాడు. పనిపాట లేదల్లే వుంది. ఏం పనులో యేమో మాయదారి ఉద్యోగాలు. ప్రాణానికి హాయిగా కాస్తా తీరిక దొరుకుతుందా దేవుడా అన్నంత విసుగొస్తుంది గదా! ఆ మహమ్మారి హెడ్ మిస్ట్రెస్‌గారు సలహాలిస్తుంది స్పెషల్ క్లాసులు పెట్టుకోమని. ఉన్న క్లాసులకు వచ్చి చావరు కుర్ర వెధవలు... సోమవారం ఎస్సేలిస్తానన్నాను. రేపయినా కూర్చొని రాసిపడేయాలి. లేకపోతే విరామ సంగీతంలా గోలపెట్టేస్తారు. వెధవ రేడియోవాళ్ళు బోరు కొట్టించకపోతే కాస్తా మంచి పాటలు పెట్టి ఏడవరాదూ? ఇంకా సిలోన్ వాడు కాస్తా నయమే. మరీ శ్రోతలు కోరని పాటలు ఏరి పెట్టడు. ఇంతకీ రఫీకి పద్మశ్రీ వచ్చిందా? ఏమిటో ఈ కాలం. ఏ బిరుదుకు విలువ వుండేదేసింది గనుకలే. డబ్బుకే ఏ విలువైనా. అక్షరం ముక్కరాని విద్యాశాఖా మంత్రులు దేశాలు చుట్టేసి వస్తున్నారు. ఆ పిల్లెవరో ఇడియమ్ ఉపయోగించమంటే "ద పోస్టాఫ్ ఎ మినిస్టర్ ఈజ్ నాటె బెడ్ ఆఫ్ రోజెస్" అని రాసింది వెధవ తెలివని. జ్యోతిలక్ష్మి డ్యాన్సుల గురించి మాట్లాడమంటే తయారు గాని, ఈమధ్య సుశీలెందుకో చెత్తపాటలు పాడేస్తూంది. గుండెలదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్కొకటి. ఈ రైలు చప్పుడుకు గుండె దడదడ లాడి పోతుందబ్బా, స్టేషనుకు దగ్గరగా చూడొద్దంటే వినలేదియన.. ఇంతకీ ఇవాళ ఇంటికి వేంచేస్తారో లేదో... గడపదాటేక కొంపగుర్తుంటుందా? రేస్ కోర్సులే దర్శించాలా క్లబ్బుల్లో తాగి తందనాలే ఆడాలా మరి? పిచ్చితల్లి నిన్నటి నుండి నాన్నెప్పుడు వస్తాడే అని కొట్టుకుపోతూంది. ఆ తండ్రికుండొద్దూ పిసరంత అభిమానం? అయినా మానం అభిమానం అన్న పదాలను మర్చిపోతున్నార్లే మనుషులు. లేకుంటే పదవులకోసం పెద్దపెద్ద వాళ్ళే శిగపట్లకు దిగుతారా? ప్రజలేమో కూటికీ గుడ్డకూ మొహం వాచి ఏడుస్తుంటే... కమిటీలు వేశామంటూ

నిద్రపోతారు నాయకులు. ఔను కోస్లా కమిటి ఇంతకీ ఏమంటుందో చూడాలి' రామచంద్రా ఏం కలికాలం తండ్రీ ఇప్పటికే సినిమాలు చూడాలంటే సిగ్గుపడాల్సి వస్తూంది. చంటివాడు మొన్న సినిమానుండి వచ్చినప్పటి నుండి తెగ దగ్గుతున్నా డెందుకనో, ఆ గ్లయ్‌కోడిన్ సీసా ఒకటి తెచ్చి పోశేయండి అంటే వినిపించుకున్నారు కారీయన. ఎంతసేపూ కిటికీ దగ్గర నిలబడి దారేపోయే ఆడవాళ్ళను చూడటానికే చాలదాయె. పక్కింటి పిల్లకు ముప్పయ్యేళ్ళొస్తున్నా ఇంకా పెళ్ళికాలేదెంచేతో, పెద్దదానికి పది హేనేళ్ళకల్లా ఎల్లాగో ఆ మూడుముళ్ళూ వేయించేయాలి కాలం అల్లా తగలడుతూంది మరి. సుబ్బమ్మ మనవరాలు కిరస్తానీ వాడితో లేచిపోయిందట దాని అందాన్ని చూచి కాకపోయినా సంపాదించే రాళ్లకు ఆశపడి వుంటాడా కుర్రాడు. ధరలన్నీ మండిపోతున్నాయి కదా. అవ్వ! మూడోతారీకున తెచ్చిన మూడు కేజీల పంచదార ఇరవయ్యో తేదీకల్లా అయిపోయిందంటూంటే ఈ మహాతల్లి ఇక బ్రదికేదెల్లా? కొంపదీసి చాటుగా అమ్మేస్తుందా? పాపిష్టిదాన్ని! దేవుడా అంటూ చాకిరీ చేసుకు పడున్న ముసలావిడను గురించా పాడు ఆలోచన? మా అత్త నాకు వండిపెడితే పక్కింటి రావమ్మకెందుకో అంత ఏడుపు? "మీలాటి అత్తగారుంటే మేమూ మహారాజుల్లా ఊళ్ళంబట తిరిగేవాళ్ళం పిన్నీ" అంటూ సాగదీసుకుంటుంది. ఏమయినా ఆవిడ కంఠాన్ని మెచ్చుకోవాలి. నండూరి వారి పాటలు ఏం చక్కా పాడుతుందనీ. 'కొమ్మలో కోయిల కూ అంటదే' అన్నప్పుడు కోకిలలాగానే పలికింది. అసలు పాటలంటే అవీ! 'కలలోన నా యెంకి కతలు సెపుతుంటేనూ...' అంటుంటే మనసు నిండా సంతోషమే వున్నట్టుంటుంది. ఏవిటో కథల్లో కవిత్వాల్లో ప్రేమా, ఆరాధనా అంటూ రాస్తారేగాని నిజంగా ఉంది యేడిశాయా అని? కొత్త మోజు తీరేక రోజూ సాధించడమేగాక! ఈయన మాత్రం ఎన్ని కబుర్లు చెప్పేరనీ. ఇప్పుడేమో పెళ్ళాంతప్ప ప్రతి ఆడదీ అందగత్తే. ఏదో వదిలించుకోవాలని కట్టేరు నన్ను. పెద్ద చెల్లాయికి ఆ డాక్టరు సంబంధం కుదిరిందో లేదో? ఆ పిల్లాడు వేణువూదగలడట. అతగాడు ఆస్పత్రి నుండి ఏ పన్నెండింటికో వస్తే ఇది మురళి పాటకు రగిలి 'మరుగు నీ వెన్నెలలు సాగయునా ఎదకేల, తగని సౌఖ్యజ్వాల' అంటూ కృష్ణ శాస్త్రి గారి గేయం పాడుకోవాలిసిందే.

కృష్ణ శాస్త్రి గారికి క్రికెట్ వచ్చి వుంటే ఎలావుండేది? అప్పుడు ప్రసన్ననూ, పటౌడని ఎవరూ మాట్లాడించి వుండేవారు కాదేమో! షర్మిలా ఠాగూరు కూడా ఆయన వెంట పడేది. ఏమయినా హిందీ ఫీల్డులో వైజంతిమాల ముందు ఎవరూ పనికిరారబ్బా. ఎన్నేళ్ళొచ్చినా యేమి ఫిగర్ ఆమెది - మనవాళ్లు మొదటి సినిమాలో నాజూగ్గా కనబడి రెండోదాంట్లో స్క్రీన్ పట్టకుండా తయారవుతారు. ఈ మధ్య మరీ లావెక్కుతున్నానులా వుంది. రేపటి నుండి చపాతీలు తినాలి రాత్రిపూట. శివరాత్రి ఎల్లుండే గాబోలు, గుళ్ళో ఏదో పురాణం చెప్తున్నారట .. ఆ అక్కడ చేరి చెప్పుకునేది వంటింటి పురాణమేగా, దేవుడు ఎక్కడ మాత్రం లేడు గనుక గుడికెళ్ళి పళ్ళూ, పూలు ఇస్తేనే భక్తి వున్నట్టు లెక్కేమిటి? జంధ్యాల వారన్నట్టు "నైవేద్య మిడమాకు నారి కేళము లేదు హృదయమే చేతికందీ యనుంటి" అనగల భక్తి ప్రధానంగాని, ఏం భక్తో గాని దేవుని పేరు చెప్పి దొంగసన్యాసులు బ్రతికిపోతున్నారు హాయిగా. ఈ కాలమేవిటిలే జేన్ ఆస్టిన్ వ్రాయలేదూ

పొట్టకూటికోసం క్లర్జిమెన్‌గా చేరేవాళ్ళను గురించి. రాసింది ఆరు నవలలైనా ఏం పేరొచ్చిందామెకు? టాలెంటుండాలిగాని ఇమిటేట్ చేస్తే వస్తుందా కళన్నది? పాదధూళిని శిరస్సున ధరించినంత మాత్రాన శరత్‌బాబు హీరోయిన్‌ను సృష్టించామనుకుంటారు కొందరు వెర్రివాళ్ళు. ఆ సుశీలకు యేం వెర్రో ఏమో గాని ఎప్పుడూ ఆ సరోజ చుట్టూ తిరుగుతూంటుంది. ఒక్కరోజు సెలవొస్తే ఆవిడను చూడకుండా వుండలేదట, విడ్డూరం కాకపోతే?

కాలాన్ని బట్టి వింతలూ విడ్డూరాలు పుడతాయి. పత్రికలో వేస్తున్నారుగా ఆడదానిగామారిన మగాడికథ! నమ్మలేమబ్బా ఇలాంటివి. ఏ నమ్మకాలు నిలిచేడుస్తున్నాయి గనుకా? రాహువు పీడొదిలిందని గ్రహణం కాగానే తలారా స్నానం చేసేవాళ్ళమా. మనుషులో పిడుగులో గానీ చంద్రుడి మీదదిగి నడిచి మరీవచ్చేరట ఆ ఆంస్ట్రాంగ్ వాళ్లూను. ఇహ దేవుడున్నాడని మాత్రం ఎవరు నమ్ముతారు? టాగూరు వంటి అమాయకు డెవడైనా అంటాడేమో 'గివ్ మి ది స్ట్రెంత్ టు రెయిస్ మై మైండ్ హై ఎబౌ డెయిలీ ట్రైఫిల్స్' అని... ఏవన్నా జీవిత మన్నాక బాధలుగాధలూ ఉండకతప్పుతాయా వీలు చూసుకొని దీపావళి పోటీకి కథొకటి రాయాలి. దెబ్బతో ఆ మాధవి గర్వమణచాలి. ఒక నవలేదో అచ్చయిందని ఏం గర్వం ఆవిడకు? ఎవడికాళ్లో పట్టుకుంటే నేనూ ఓ పది నవలలు అచ్చేయించగలను. ఒక కథ తిరిగొచ్చేసరికి నీరసమనిపిస్తుంది. జీవితమంటే యెదురు దెబ్బలు తగలవా ఏమిటి? ఇలియట్ అన్నట్టు 'ఉయ్ మస్ట్ మేక్ ది బెస్ట్ ఆఫ్ ఏ బాడ్ జాబ్' ఈ పిల్లల మొహం చూచి బ్రతకాలనిపిస్తుంది గానీ బ్రతుకంటే రోతపుట్టేసిందమ్మా. మళ్ళీ చంటిదాని బోసినవ్వుచూస్తే స్వర్గానికికూడా పోబుద్ధిపుట్టదు. పిల్లలనవ్వు ఎంత అందంగా వుంటుందని! అందుకేనేమో కీట్స్ అన్నాడు 'ఏథింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ ఫ్లవరీ బాండ్ టు బైండ్ అజ్ టు ది ఎర్త్' అని రేపయినా బాబిగాడికి మందు తేవాలి ఉన్న పదిరూపాయలు ఫస్ట్‌దాకా ఎలా సరిపుచ్చాలో ఏమిటో చక్కగా ఉమర్ ఖయ్యాం లయ్యాం కాదు. 'పుట్టనట్టి రేపును గిట్టినట్టి నిన్న వీని తలపులబడి వృధావేసటేల? ఎదుట కనిపించు సుఖమును వదలుటేల'? అంటూ హాయిగా బ్రతికేయడానికి రాత్రి గడిచి తెల్లారితే ఎవరి బ్రతుకు లేమవుతాయో తెలియదుగదా! నిన్న ఉక్కు ముక్కలావున్న శేషగిరిరావు ఈరోజులేడు. మరీ అంతపరధ్యానం మనిషికూడాకాదు ఎలా పడ్డాడో రైలు క్రింద! 'ఫేట్ ఈజ్ ది డెస్టినీ ఆఫ్ లైఫ్' అని ఊరకే అన్నారా. ఏక్షణాని కేమవుతామో తెలియదుగదా, ఆయన కొడుక్కు ఉద్యోగం దొరికినట్టులేదు ఇంకా. ఇంజనీరు డిగ్రీలుంచుకొని హోటల్లో సప్లయిర్స్‌గా అఘోరిస్తున్నారు మనవాళ్ళు. ప్రభుత్వంవారు మట్టుకు తమ పదవుల కోసం కొట్టు కొంటున్నారు. ప్రతీ ఎలక్షన్‌ముందూ అమాయక ప్రజలకు ఏదో 'ఎర' చూపిస్తూంటారు. చూద్దాం మేడం గాంధీగారు ఆశ చూపిస్తున్న శుభదినం పేదరికమంటూ ఉండని పర్వదినం ఎన్నడొస్తుందో? సోషలిజం మాట దేవుడెరుగ్గానీ లంచగొండి తనం ఎక్కువయిపోతూంది మధ్య. ఇలాంటి వెధవ బుద్ధులుచూపించబట్టే లోకంలో అన్యాయం పెరిగిపోతుంది. ఈయన ఆఫీసర్‌ని కలుసుకున్నారో లేదో ఇంకా ఉత్తమాటలతో ప్రమోషన్ రాదంటే ఆయనకు కాస్త ముడుపు కట్టండి అంటే వినిపించుకోరుగా 'ఈవ్ మాటలు వినబట్టే ఆడమ్ బోల్తాపడ్డాడు. అందుకే మిల్టన్ ఆడ వాళ్ళను

"ఫెయిర్ డిఫెక్ట్ ఆఫ్ నేచర్" అన్నాడు అంటారు. ఆ ప్రమోషన్ వచ్చేదెన్నటికి ఈయన నాకు బనారస్ చీర కొనేదెన్నటికి? రామంగాడు బెనారస్‌లోనేగా ఉన్నాడు? వెధవ ఒక ఉత్తరమ్ముక్క అక్కయ్యకు రాయాలని తోచదువాడికి, ఇరువైనాలుగు గంటలు ఆ హెమింగ్వే నవలలు చదవడానికే చాలదు అయినా విచిత్రం కాకపోతే ఆ చేపలుపట్టే ముసలబ్బిలా ఎవరైన తమతో తాము మాట్లాడుకుంటారేమిటి? చిన్న ముండ ఆటల్లో అలాగే వాగుతుంది. ఇక నీళ్ళోసుకొని పొయ్యంటించుకొని అంటూ. పిచ్చితల్లి కందిరీగ కుట్టిందని నొప్పితో ఏడ్చి ఏడ్చి నిద్దరోయింది. కృష్ణపరమాత్ముడు స్థిత ప్రజ్ఞుడుగా దుఃఖేష్వ నుద్విగ్నమనాః సుఖేషువిగతస్పృహః అంటూ బోధించేవాడుగాని నొప్పినీ, బాధనూ, సంతోషాన్నీ, దుఃఖాన్నీ ఎవరు మాత్రం సమానంగా స్వీకరించగలరు? అటువంటి మహాత్ముడు బ్రతికిననాళ్ళు "త్రాగకండిరా నాయనా" అంటూ బ్రతిమాలి పాయేడు ఆయన శత జయంత్యుత్సవ సందర్భంగా గవర్నమెంటే సారాకొట్లు పెట్టేసింది భేష్! ఆయనెక్కడయినా బ్రతికున్నాడంటే అది ఏ రాజారావు నవలల్లోనో అంతే. బుఱ్ఱలో పుట్టిన ఆలోచనలను ఆపాళంగా కాగితం మీదకి దింపేసి నవలలు రాసేసారు జేమ్స్ జాయిస్, వర్జీనియా ఉల్ఫ్ బోటివాళ్ళు. అదెలా సాధ్యం? ఆయనగారు దిగబడినట్టున్నారు వెళ్ళి అన్నాలు పెట్టొద్దూ?...

"శారదా" పత్రిక

తేది : 1-11-1971.